40,000 కోట్ల ఐపీవో!

ఈ ఏడాది ద్వితీయార్ధంలో జియో పబ్లిక్ ఇష్యూకు వచ్చే అవకాశం

సంస్థ విలువ రూ.10 లక్షల కోట్లపైనే

ముంబై, జనవరి 2: భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ రాబోతున్నది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. ఏకంగా రూ.35,000-40,000 కోట్ల ఐపీవోకు వస్తున్నట్టు తెలుస్తున్నది. అధినేత అంబానీ ఈ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఇప్పటిదాకా హ్యుందాయ్ పేరిట ఉన్న భారీ ఐపీవో (రూ.27,870 కోట్లు) రికార్డు త్వరలోనే కనుమరుగైనట్టే. గత ఏడాది అక్టోబర్‌లో వచ్చిన హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూనే ప్రస్తుతం దేశంలో వచ్చిన ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లలో అతిపెద్దదిగా ఉన్నది.

ద్వితీయార్ధంలో..

ఈ ఏడాది జూలై-డిసెంబర్‌లో జియో ఐపీవో రావచ్చన్న అంచనాలున్నాయి. ఇక సంస్థ విలువ రూ.10 లక్షల కోట్లపైనే (120 బిలియన్ డాలర్లు) ఉంటుందని లెక్కిస్తున్నారు. అమ్మకానికి ప్రస్తుత షేర్లు, కొత్త షేర్లు రెండూ పెట్టవచ్చని సమాచారం. ప్రధాన ఇన్వెస్టర్ల కోసం ఇప్పటికే ప్రీ-ఐపీవో ప్లేస్‌మెంట్ కోసం చర్చలు కూడా మొదలయ్యాయి. కాగా, నిరుడు జూలైలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ జెఫ్రీస్.. ఈ ఏడాది 112 బిలియన్ డాలర్ల విలువతో రిలయన్స్ జియో ఐపీవో వస్తుందని చెప్పిన సంగతి విదితమే. ఇదిలావుంటే గడిచిన పదేండ్లలో తొలిసారి గత ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) షేర్లు మదుపరులకు నష్టాలను మిగిల్చాయి. 2024లో ఆర్‌ఐఎల్ షేర్ విలువ దాదాపు 6 శాతం పడిపోయింది. అయినప్పటికీ జియో ఐపీవోకు ముకేశ్ అంబానీ సిద్ధమవుతుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

చార్జీల దెబ్బ

గత ఏడాది జూలైలో టెలికం సంస్థలు మొబైల్ టారిఫ్ చార్జీలను పెంచాయి. అయితే ఈ నిర్ణయం జియోసహా మిగతా అన్ని సంస్థలనూ దెబ్బతీసింది. జూలై నుంచి అక్టోబర్ వరకు జియో కస్టమర్లు సుమారు 1.65 కోట్లు తగ్గిపోయారు. అయినప్పటికీ దేశీయంగా జియో కస్టమర్లే ఇప్పటికీ ఎక్కువ. వినియోగదారులపరంగా జియో మార్కెట్ వాటా 40 శాతంగా ఉన్నది. ఈ నేపథ్యంలో పోయిన కస్టమర్లను తిరిగి ఆకట్టుకునేందుకు మార్కెట్‌లో ధరల యుద్ధం చోటుచేసుకోవచ్చని, ఇది ఏఆర్‌పీయూ (ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం)ను ప్రభావితం చేయవచ్చని ఇండస్ట్రీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో రాబోయే జియో ఐపీవోపై ఈ పరిస్థితుల ప్రభావం తప్పక ఉంటుందని కూడా వారు విశ్లేషిస్తున్నారు.

హైదరాబాద్‌లో సియారా గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్, జనవరి 2: అమెరికాకు చెందిన కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ టెక్నాలజీ సేవల సంస్థ సియారా..హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్(జీఐసీ)ని ప్రారంభించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ జీఐసీ సెంటర్ ప్రపంచంలో అతిపెద్దది కావడం విశేషం. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 100 మంది వరకు ఉద్యోగస్తులు విధులు నిర్వహిస్తుండగా, వచ్చే రెండు నెలలో ఈ సంఖ్యను 200కి పెంచుకోనున్నట్లు కంపెనీ సీఈవో రిషీ రానా తెలిపారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను 500కి పెంచుకునే అవకాశం కూడా ఉందన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు భేష్ గ్గావున్నాయని, దీంతో అంతర్జాటీ టెక్నాలజీ సంస్థలు ఇక్కడ జీఐసీలను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. కంపెనీ ఆదాయం వచ్చే రెండేండ్లలో 200 మిలియన్ డాలర్లకు చేరుకుంటున్నదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

మార్కెట్లోకి హ్యుందాయ్ క్రెటా ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు

న్యూఢిల్లీ, జనవరి 2: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్..మరో ఈవీని దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. దేశీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన క్రెటాను గురువారం ఈవీ రూపంలో ఆవిష్కరించింది. ఈ నెలలో జరగనున్న వాహన పండుగలో ఈ కారును ప్రదర్శించబోతున్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా. దీంట్లో 51.4 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు మైలేజీ ఇవ్వనుండగా, 42 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 390 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశీయ మార్కెట్లోకి సంస్థ విడుదల చేసిన మూడో మాడల్ ఇదే కావడం విశేషం. టాటా కర్వ్.ఈవీ, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, మారుతి ఈ-విటారా, బీవైడీ ఆటో 3లకు పోటీగా సంస్థ ఈ వాహనాన్ని విడుదల చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఎలక్ట్రిక్ కారు ప్రత్యేకతలు

- సింగిల్ చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- కేవలం 7.9 సెకండ్లలో 100 కిలోమీటర్లు వేగాన్ని అందుకోనున్నది.
- వాయిస్‌తో పానోరామిక్ సన్‌రూప్ కంట్రోల్, రెండు 10.25 ఇంచుల డిజిటల్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే
- ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, డిజిటల్ కీ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది.

- కేవలం 58 నిమిషాల్లోనే 80 శాతం వరకు బ్యాటరీ చార్జింగ్‌కానున్నది. మొత్తం 4 గంటల్లో పూర్తికానున్నది.
- ఈ కారుపై ఎనిమిదేండ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల బ్యాటరీ వ్యారెంటీ కల్పిస్తున్నది సంస్థ

ఇండో ఫార్మ్ ఐపీవోకి అపూర్వ స్పందన

న్యూఢిల్లీ, జనవరి 2: వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ పబ్లిక్ ఇష్యూనకు అపూర్వ స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 225.57 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.260 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి 84.70 లక్షల షేర్లను విక్రయించడానికి పెట్టగా..దీనికి 192 కోట్ల షేర్లకు బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. అంటే రూ.260 కోట్ల ఐపీవోకి రూ.41,459 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.78 కోట్లు సేకరించిన సంస్థ. షేరు ధరల శ్రేణిని రూ.204-215గా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించిన 86 లక్షల ఈక్విటీ షేర్లలో 35 లక్షల షేర్లు ప్రమోటర్ రణ్‌బీర్ సింగ్‌నకు చెందినవి.

తీరు మారేదే..లే

ఆగని రూపాయి పతనం

ముంబై, జనవరి 2: భారతీయ కరెన్సీ రూపాయి.. డాలర్ ముందు తేలిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ మారకపు విలువ రోజుకింత దిగజారుతూ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పతనమవుతున్నది. గురువారం మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేని విధంగా డాలర్‌తో పోల్చితే ఎక్స్చేంజ్ రేటు 85.75 వద్దకు క్షీణించింది. దీంతో ఈ ఏడాది రూపాయికి తొలి నష్టం ఎదురైనట్టైంది. ఇంట్రా-డేలోనైతే 85.79కి పడింది. ఇక బుధవారం స్థిరంగా ఎక్కడిదక్కడే ఉన్న విషయం తెలిసిందే. కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్, దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, ఈ 2025లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు తక్కువేనన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతుండటంతో పరుగులు పెడుతున్న డాలర్ ఇండెక్స్, అమెరికా పదేండ్ల బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం వంటివి భారతీయ కరెన్సీని మరింత ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రూపాయి పతనం దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందే. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ పతనం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది.

మే(జో)కిన్ ఇండియా!

దేశంలో తయారీ రంగం కుదేలు • ఏడాది కనిష్ఠానికి వృద్ధిరేటు డౌన్

డిసెంబర్‌లో 56.4గానే నమోదు • కొత్త ఆర్డర్లు లేక పడకేసిన ఉత్పత్తి



'మేకిన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ గడిచిన పదేండ్లుగా ఊదరగొడుతున్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారు అర్భాట ప్రచారమంతా ఉత్తదేనని తేటతెల్లమైంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన తయారీ రంగం గతంలో ఎన్నడూ మూడని గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఉత్పాదక రంగంలో వృద్ధిరేటు ఏకంగా 12 నెలల కనిష్ఠాన్ని చేరుకోవడమే ఇందుకు రుజువు. డిసెంబర్‌లో మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.4కే పరిమితమైంది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో ఉత్పత్తిలో పెరుగుదల కనిపించకుండా పోయిందని హెచ్‌ఎస్‌బీసీ తాజా సర్వే తేల్చిచెప్పింది.

న్యూఢిల్లీ, జనవరి 2/(స్పెషల్ టాస్క్ బ్యూరో): దేశ జీడీపీలో 17 శాతం వాటా కలిగిన తయారీ రంగం అంతకంత కూ కుదేలవుతున్నది. కొత్త ఆర్డర్లు లేకపోవడంతో పరిశ్రమల్లో ఉత్పత్తి దారుణంగా పడిపోతున్నది. దేశంలోని పరిశ్రమల్లో ఉత్పత్తి తీరుతెన్నులకు అద్దం పట్టే హెచ్‌ఎస్‌బీసీ-మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గణాంకాలే ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు తీసుకొంటున్న విధానపరమైన నిర్ణయాల్లో లోపమే ఇందుకు కారణమని పారిశ్రామికవేత్తలు ఆరోపిస్తున్నారు.

ఆర్డర్లు లేకపోవడంతో..

తయారీ రంగానికి సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తుల్లో వృద్ధిరేటును బేరీజువేసే మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ మరింతగా పతనమైంది. గత నవంబర్‌తో పోలిస్తే మరింతగా తగ్గి డిసెంబర్‌లో 56.4కు పరిమితమైంది. ఇది 12 నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. తయారీ రంగంలో కొత్త అవకాశాలు సన్నగిల్లడంతో ఆర్డర్లు తగ్గి ఉత్పత్తిలో పెరుగుదల మందగించిందని సర్వే అభిప్రాయపడింది. భారతీయ మార్కెట్‌లో నెలకొన్న దుస్థితికి ఇది నిదర్శనంగా తెలుస్తున్నది. అంతకుముందు నెల నవంబర్‌లో 56.5 శాతంగా నమోదైన వృద్ధి రేటు మరింతగా తగ్గడంతో దేశంలో వ్యాపార-పారిశ్రామిక నిర్వహణ పరిస్థితులు ఇంకా దిగజారాయని సర్వే అభిప్రాయపడింది.

పోటీ, ఒత్తిళ్లు

తయారీరంగం ఈ స్థాయిలో గడ్డుపరిస్థితులు ఎదుర్కోవడానికి 5 శాతం కంటే ఎక్కువగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం, పోటీ, ఒత్తిళ్లే కారణమని సర్వే అభిప్రాయపడింది. ప్రతీ పది కంపెనీలో కేవలం ఒక్క కంపెనీ మాత్రమే అదనపు కార్మికులను నియమిస్తుండగా, ప్రతీ పదిలో రెండు కంపెనీలు ఉద్యోగులను తీసివేస్తున్నట్టు సర్వే పేర్కొంది.

భవిష్యత్తులోనూ కష్టమే!

'భారతీయ తయారీ రంగ కార్యకలాపాలు మందగమనంలో కొనసాగుతున్నాయి. గత ఏడాది వచ్చిన కొత్త ఆర్డర్లలో చెప్పుకోదగ్గ వృద్ధేమీ కనిపించలేదు. దీంతో ఉత్పాదక రంగంలో భవిష్యత్తు వృద్ధి బలహీనమే అని చెప్పవచ్చు' - **హెచ్‌ఎస్‌బీసీ ఎకనామిస్ట్ ఇన్స్ లామ్**

2024లో తయారీ రంగం గడ్డు పరిస్థితి ఇలా..

నెల	మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ (శాతాల్లో)
జనవరి	56.5
ఫిబ్రవరి	56.9
మార్చి	59.1
ఏప్రిల్	58.8
మే	57.5
జూన్	58.3
జూలై	58.1
ఆగస్టు	57.5
సెప్టెంబర్	56.5
అక్టోబర్	57.5
నవంబర్	56.5
డిసెంబర్	56.4

ఆధారం: హెచ్‌ఎస్‌బీసీ మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ

బెంగాల్ అస్థిరతకు బీఎస్ఎఫ్ కుట్ర: మమత

కోల్‌కతా, జనవరి 2: బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించడానికి బీఎస్ఎఫ్ సాయం చేస్తున్నదని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సంచలన ఆరోపణలు చేశారు. తద్వారా రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర జరుగుతున్నదని ఆమె వెల్లడించారు. ఈ విషయంలో బీఎస్ఎఫ్‌కు కేంద్రం మద్దతు ఇస్తున్నదని అన్నారు. 'ఇస్లాంపూర్, సితాయ్, చోప్రా తదితర సరిహద్దు ప్రాంతాల్లో చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించేందుకు బీఎస్ఎఫ్ అనుమతిస్తున్నది' అని ఆమె సమీక్ష సమావేశంలో ఆరోపించారు.

సిరియా మాజీ అధ్యక్షుడు

అసద్‌పై విషప్రయోగం?

మాస్కో, జనవరి 2: సిరియా మాజీ అధ్యక్షుడు, రష్యాలో ఆశ్రయం పొందుతున్న బషర్ అల్ అసద్‌పై విష ప్రయోగం జరిగినట్టు తెలుస్తున్నది. ఈ విషయాన్ని జనరల్ ఎస్వీఆర్ పేరుతో సోషల్ మీడియా ఖాతాను నిర్వహిస్తున్న రష్యా మాజీ గూఢచారి వెల్లడించారు. ఆదివారం మాస్కోలో అసద్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని, తీవ్రమైన దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డట్టు చెప్పారు. రష్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యులు అసద్ ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే చికిత్స అందిస్తున్నారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్టు తెలిపారు. అసద్ ఒంట్లో విషం ఉన్నట్టు వైద్యులు గుర్తించారని చెప్పారు.

ఇస్కాన్ నేత చిన్మయ్‌కి బెయిల్ నిరాకరణ

ఢాకా: ఇస్కాన్ మాజీ నేత చిన్మయ్ కృష్ణ దాస్‌కు బెయిలు మంజూరు చేసేందుకు బంగ్లాదేశ్ కోర్టు గురువారం తిరస్కరించింది. విచారణ సందర్భంగా ఆయన తరపున 11 మంది న్యాయవాదులు బెయిలు దరఖాస్తుతో హాజరయ్యారు. ఈ విచారణకు దాస్ వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఆయన దేశద్రోహానికి పాల్పడినట్లు ఆరోపణలు నమోదైన సంగతి తెలిసిందే. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి మహమ్మద్ సైఫుల్ ఇస్లాం ఇరు పక్షాల వాదనలను విన్న తర్వాత బెయిలును తిరస్కరించారు.

చైనాలో మరో మహమ్మారి?

- **రోగులతో కిక్కిరిసిన దవాఖానలు**
- **శ్మశానాలకు పెరిగిన శవాలు**
- **ఆన్‌లైన్‌లో వీడియోలు వైరల్**
- **నోరు మెదపని అధికారులు**

న్యూఢిల్లీ, జనవరి 2: కరోనా విలయం నుంచి ఇప్పుడిప్పుడే ప్రపంచం కోలుకుంటున్న తరుణంలో మరో షాకింగ్ వార్త ప్రపంచదేశాలను కలవరపరుస్తున్నది. కరోనా వైరస్‌కు మూలమైన చైనాలో మరో మహమ్మారి వ్యాప్తి చెందుతున్నదనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడ హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) తీవ్రంగా వ్యాప్తి చెందిందని, కొవిడ్ వెలుగులోకి వచ్చిన సరిగ్గా ఐదేండ్ల తర్వాత మరో ప్రమాదకర వైరస్ వ్యాప్తి చెందుతున్నదని స్థానిక, సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ వ్యాధి కారణంగా అక్కడి దవాఖానలు రోగులతో, మృతులతో శ్మశానాలు నిండిపోతున్నాయని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో కొవిడ్-19, ఇన్‌ఫ్లూయెంజా ఏ, హెచ్ఎంపీవీ, మైకో ప్లాస్మా నిమోనియా లాంటి బహుళ శ్వాసకోస వైరస్‌ల తీవ్ర వ్యాప్తిపై ఒకరికొకరు హెచ్చరికలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చైనాలో అత్యవసర పరిస్థితి ప్రకటించారని ప్రచారం జరిగినా అధికారికంగా దానినెవరూ నిర్ధారించ లేదు. ఈ వ్యాధి హెచ్ఎంపీవీ ఫ్లూ లాంటి వ్యాధి లక్షణాలతో ఉంటుందని, కొవిడ్ 19 వ్యాధి లక్షణాలు కూడా ఉంటాయని డాక్టర్లు తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ వైరస్ వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు.

'చైనా ఇప్పుడు బహుళ వైరస్ వ్యాధులతో బాధపడుతున్నది. ఇన్‌ఫ్లూయెంజా ఏ, హెచ్ఎంపీవీ, మైకోప్లాస్మా నిమోనియా, కొవిడ్ వైరస్‌లు దేశంలో విజృంభిస్తున్నాయి. దవాఖానాలు రోగులతో నిండిపోతున్నాయి. శ్మశానాలకు కూడా తాకిడి పెరిగింది. నిమోనియో, వైట్ లంగ్ కేసులతో పిల్లల దవాఖానలు నిండిపోతున్నాయి' అని ఎక్స్‌లో ఒక చైనా పౌరుడు పోస్ట్ చేశాడు. కాగా, చైనాలో వ్యాధుల నియంత్రణ సంస్థను ఉటంకిస్తూ రాయిటర్స్ ఒక వార్తా కథనాన్ని వెలువరించింది. తెలియని మూలకం ఉన్న నిమోనియా కోసం పర్యవేక్షణ వ్యవస్థను ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామని, శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు కేసులు పెరిగే అవకాశం ఉందని తమకు తెలియజేసినట్టు వెల్లడించింది. అయితే చైనాలో ప్రతి ఏడాది శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులతో చేరే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, అయితే ఈ ఏడాది నమోదైన కేసులు గత ఏడాది కన్నా తక్కువేనని ఒక వైద్యాధికారి తెలిపారు. హెచ్ఎంపీవీ వ్యాధి సోకిన వారు గుడ్డిగా యాంటీ వైరల్ డ్రగ్స్ వాడవద్దని, డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స పొందాలని, దీనికి వ్యాక్సిన్ లేదని, అయితే జలుబు వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని ఆయన తెలిపాడు.

నోరు మెదపని డబ్ల్యూహెచ్‌వో

హెచ్ఎంపీవీ, ఇతర వైరస్ వ్యాధుల గురించి జరుగుతున్న ప్రచారం చూస్తే కొవిడ్ లాంటి మరో మహమ్మారి కబళించడానికి సిద్ధంగా ఉందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 'దీనిపై విశ్వసనీయమైన సమాచారం ఆరోగ్య శాఖ అధికారుల నుంచి వెలువడే వరకు మనం దీనిని నమ్మాల్సిన అవసరం లేదు' అని ఉన్నతాధికారి పేర్కొన్నారు. 'కొత్త అంటువ్యాధి ఉనికి గురించి చైనా ఆరోగ్య శాఖ అధికారులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎలాంటి నిర్ధారణ చేయలేదు. అత్యవసర పరిస్థితిని ప్రకటించ లేదు. సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నట్టు కొత్త అంటు వ్యాధి కనుక వ్యాపిస్తున్నట్టయితే దాని గురించి అధికారులు హెచ్చరిక ప్రకటనలు జారీ చేసేవారు కదా?' అని కొందరు పేర్కొంటున్నారు. అయితే ప్రస్తుతం వైరల్ అవుతున్న వీడియోల్లోని దృశ్యాలు పౌరుల్లో భీతి పుట్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా దవాఖానల్లో ఉన్న జనం.. రోగులు, ముఖ్యంగా పిల్లలు శ్వాస కోస వ్యాధులతో చికిత్స పొందడం కన్పించింది. ఇవి నిజమైనవా కావా అన్నది నిర్ధారించే వారు లేరు. పరిస్థితి అంతా గందరగోళంగా ఉంది అని చాలామంది వీటిని చూసి వాపోతున్నారు. దీనిపై డబ్ల్యూహెచ్‌వో ప్రకటన చేయాలని పౌరులు డిమాండ్ చేస్తున్నారు. కొవిడ్ సమయంలో కూడా చైనా పూర్తి గోప్యత పాటించింది.

10 నిమిషాల్లో అంబులెన్స్

- **గురుగ్రామ్‌లో ప్రారంభించిన బ్లింకిట్**

న్యూఢిల్లీ: ఇప్పటికే క్విక్ కామర్స్ ద్వారా 10 నిమిషాల్లో కావాల్సిన వస్తువులను మన ఇంటి ముంగిటకు చేరుస్తున్న బ్లింకిట్ ఇప్పుడు 10 నిమిషాల్లో అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. హర్యానాలోని గురుగ్రామ్‌లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని గురువారం ప్రారంభించారు. ఇక నుంచి వినియోగదారులు తమ వినియోగ వస్తువుల కోసమే కాదు, అంబులెన్స్ కోసం కూడా బ్లింకిట్ యాప్‌ను వినియోగించవచ్చునని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అంబులెన్స్‌లలో ప్రాణ రక్షణ పరికరాలతోపాటు అత్యవసర మందులు, ఇంజెక్షన్లు ఉంటాయి. శిక్షణ పొందిన డ్రైవర్‌తో పాటు పారామెడిక్, డ్యూటీ అసిస్టెంట్ ఉంటారు. తొలుత ఐదు అంబులెన్స్‌లతో సర్వీసును ప్రారంభించామని, త్వరలో ఈ సర్వీసును మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని, రానున్న రెండేండ్లలో దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో సేవలు అందజేస్తామని సీఈవో అల్బిందర్ తెలిపారు. ఈ సౌకర్యం ద్వారా లాభాల ఆర్జన తమ లక్ష్యం కాదని, సరసమైన ధరలకు ఈ సౌకర్యాన్ని ప్రజలకు అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఎన్‌రోల్‌మెంట్ అయితేనే

స్టూడెంట్ వీసా

లెటర్స్ ఆఫ్ ఆఫర్ చెల్లుబాటు కావు

ఆస్ట్రేలియా కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఆన్‌షోర్ స్టూడెంట్ వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా కన్ఫర్మేషన్ ఆఫ్ ఎన్‌రోల్‌మెంట్ (సీఓఈ)ని తమ దరఖాస్తుతో పాటు జత చేయాలని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. ఈ నెల 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి వస్తుందని తెలిపింది. గతంలో దరఖాస్తు చేసినవారికి సీఓఈ అవసరం లేదని చెప్పింది. సీఓఈ లేకుండా బ్రిడ్జింగ్ వీసా కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా రద్దు చేసింది. ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ స్టూడెంట్ వీసా ప్రాసెస్‌లను గాడిలో పెట్టడం కోసం ఈ నిబంధనలను అమలు చేస్తున్నట్లు ఆస్ట్రేలియా హోం శాఖ తెలిపింది. ఆస్ట్రేలియాలో ఉంటూ స్టూడెంట్ వీసాకు మారడం కోసం ప్రయత్నించే వీసా హోల్డర్లకు కొన్ని అదనపు అంక్షలను విధించే అవకాశం ఉందని కూడా చెప్పింది.

స్విట్జర్లాండ్‌లో బురఖాపై నిషేధం

బెర్న్: మరో యూరోపియన్ దేశం స్విట్జర్లాండ్ బురఖా ధరించటాన్ని నిషేధించింది. బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తమ ముఖాన్ని పూర్తిగా కప్పివుంచరాదన్న చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. జనవరి 1 నుంచి కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు తాజాగా ప్రకటించింది. దీంతో బురఖాను నిషేధించిన ఏడో యూరోపియన్ దేశంగా స్విట్జర్లాండ్ నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రజా రవాణా, రెస్టారెంట్స్, దుకాణాలు సహా బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తమ ముఖాన్ని పూర్తిగా కప్పివుంచరాదు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే, 1,000 స్విస్ ఫ్రాంకుల (సుమారుగా రూ.98వేలు) వరకు జరిమానా కట్టాల్సి ఉంటుంది. అయితే మెడికల్ మాస్క్‌లు, చలి వాతావరణంలో రక్షణ కోసం ధరించే వాటికి మినహాయింపులు ఇచ్చింది. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాల్లో ఫేస్ కవర్లు అనుమతిస్తున్నామని ప్రభుత్వం చెప్పింది.

డల్లేవాల్ దీక్షపై తప్పుదోవ పట్టించారు

ఆయన దీక్ష భగ్నం చేయాలని మేం ఆదేశించ లేదు

పంజాబ్ ప్రభుత్వం, రైతు నేతలపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ, జనవరి 2: హర్యానా-పంజాబ్ సరిహద్దు ఖనౌరిలో రైతు నేత డల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షపై పంజాబ్ ప్రభుత్వాన్ని గురువారం సుప్రీం కోర్టు తీవ్రంగా విమర్శించింది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ కొందరు ప్రభుత్వ అధికారులు, రైతు నేతలు మీడియాలో తప్పుడు అభిప్రాయాన్ని సృష్టించారని పేర్కొంది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయమంటూ న్యాయస్థానం ఎన్నడూ ఆదేశించ లేదని, ఆయన ఆరోగ్యంపట్ల ఆందోళన వ్యక్తం చేసి, అత్యవసరంగా ఆయనకు వైద్య సహాయం అందించాలని మాత్రమే కోరుకుందని జస్టిస్‌లు సూర్యకాంత్, ఉజ్జల్ భుయన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆయనకు వైద్య సహాయం అందించాలని తమ ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగిస్తున్నదని పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ తెలిపారు. కాగా, డిసెంబర్ 20న జారీ చేసిన ఉత్తర్వులపై సమ్మతి తెలియజేస్తూ చీఫ్ సెక్రటరీ, డీజీపీలు అఫిడవిట్‌లు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం కేసును జనవరి 6వ తేదీకి వాయిదా వేసింది..

న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తామని కేంద్రం ఎందుకు చెప్పలేకపోయింది?

రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని కేంద్రం ఎందుకు చెప్పలేకపోయిందని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ప్రశ్నించింది. రైతులపై విధించిన నల్ల చట్టాలను కేంద్రం ఎత్తివేసిన తర్వాత ఇచ్చిన హామీల మేరకు పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు న్యాయమైన డిమాండ్లను అమలు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ తాజాగా పిటిషన్ దాఖలైంది.

స్పీడ్‌బ్రేకర్‌తో తి